సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



ప్రైవేట్ ఆస్పత్రి సీజ్

వైద్యం వికటించి వ్యక్తి మరణించిన ఘటనలో వైద్యాధికారులు విచారణ జరిపారు. ఆస్పత్రితోపాటు మెడికల్ షాప్‌ను సీజ్ చేశారు.

- 9లో ▸



సంత.. చింత

లింగంపేటలో సంతకు స్థలం లేకపోవడంతో రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /23.3

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

శిశు సంజీవని!

- ప్రాణాలు నిలుపుతున్న నియోనేటల్ కేర్ అంబులెన్స్
- వాహనంలోనే ఐసీయూ సేవలు

మాతృత్వపు మధురిమల కోసం తపించే తల్లిదండ్రులు బిడ్డ పుట్టగానే ఎంతగానో మురిసిపోతారు. అయితే పుట్టిన బిడ్డకు ఏదో అనారోగ్య సమస్య ఉందని తెలిస్తే.. ఆ క్షణంలో వారు పడే వేదన అంతా ఇంతా కాదు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నగరంలోని ఆస్పత్రులకు తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి.. ఇది వ్యయప్రయాసలతో కూడినది.. అలాంటి వారికి భరోసానిస్తోంది నియోనేటల్ కేర్ అంబులెన్స్. ప్రారంభించిన ఏడాది కాలంలోనే ఎందరికో అపర సంజీవనిలా మారింది. నియోనేటల్ కేర్ అంబులెన్స్ సేవలపై 'సాక్షి' సండే స్పెషల్..

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: తల్లి గర్భంలో నుంచి బాహ్య ప్రపంచంలోకి అడుగిడిన నవజాత శిశువుల్లో కొందరు ఆరోగ్యపరంగా సమస్యలను ఎదుర్కొంటారు. అలాంటివారికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి స్థానికంగా వీలుకాకపోవచ్చు. హైదరాబాద్ నగరంలోని ఆస్పత్రులకు తీసుకువెళ్లే క్రమంలో ప్రైవేట్ అంబులెన్స్‌ల నిర్వాహకులు అడిగినంత ఇవ్వాల్సిన పరిస్థితి. ఈ బాధను తప్పించేందుకు, శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం గతేడాది ఆగస్టు 21 న నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చింది. శిశువును తరలించే సమయంలో కావలసిన వైద్య సేవలందించేందుకు అవసరమైన పరికరాలు, మందులు అందులో అందుబాటులో ఉంచారు. జిల్లాకేంద్రంలో ఈ అంబులెన్స్ అందుబాటులో ఉంది. 108 నంబర్‌కు కాల్ చేస్తే.. చెప్పిన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో శిశువుకు అవసరమైతే వెంటిలేటర్ కూడా పెట్టి కావలసిన వైద్య సేవలు అందిస్తూ ఆస్పత్రులకు చేరుస్తున్నారు. దీంతో కన్నవారికి అంబులెన్స్ భారం తగ్గడంతో పాటు ఆస్పత్రికి చేరేలోపు ఏమవుతుందోనన్న ఆందోళన తగ్గుతోంది. అందుకే నవజాత శిశువులకు ఇది అపర సంజీవని అయ్యింది.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇటీవల ఒక అవయవం(ఆనస్) లేకుండా అరుదైన సమస్యతో పాప జన్మించింది. ఆ శిశువుకు అత్యవసర చికిత్స అందించేందుకు నీలోఫర్ ఆస్పత్రికి తరలించాలి. 108 కు సమాచారం అందడంతో నియోనేటల్ అంబులెన్స్ వచ్చింది. శిశువుకు అంబులెన్స్‌లో కావలసిన వైద్యం అందిస్తూనే హైదరాబాద్‌కు తరలించారు. వెంటనే అక్కడి వైద్యులు చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది.

గుండారం గ్రామానికి చెందిన పసిపాపను తాచుపాము కరిచింది. దీంతో ఆమెను కామారెడ్డి ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడినుంచి నియోనేటల్ అంబులెన్స్‌లో నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో కోమాలో ఉన్న పాపను అంబులెన్స్‌లోని వెంటిలేటర్‌పై ఉంచి, అవసరమైనప్పుడు సీపీఆర్ చేసి నీలోఫర్ ఆస్పత్రికి క్షేమంగా తరలించారు. అక్కడ వైద్యం పొందిన పాప కోలుకుంది.



కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అందుబాటులో ఉన్న నియోనేటల్ కేర్ అంబులెన్స్

ఏడాది కాలంలో నియోనేటల్ కేర్ అంబులెన్స్ అందించిన సేవలు..

నెల	కేసులు	నెల	కేసులు
ఆగస్టు	08	ఫిబ్రవరి	53
సెప్టెంబర్	16	మార్చి	74
అక్టోబర్	14	ఏప్రిల్	65
నవంబర్	40	మే	68
డిసెంబర్	47	జూన్	73
జనవరి	52	జూలై	73


అంబులెన్స్‌లో చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

అంబులెన్స్‌లో అందే సేవలు..

శిశు మరణాలను తగ్గించేందుకు అందుబాటులోకి తెచ్చిన నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లో ఆస్పత్రి ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) స్థాయి వసతులున్నాయి. ఆక్సిజన్ సిస్టం, వెంటిలేటర్, మానిటర్, సిరంజీ ఇన్‌ఫ్యూజన్ పంప్, వాల్యూమ్ ఇన్‌ఫ్యూజన్ పంప్, ఏఈడీ, సెక్షన్ ఆపరేటర్ వంటి అత్యాధునిక వసతులు ఉన్నాయి. శరీర ఉష్ణోగ్రత తగ్గినా.. శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైనా.. వెంటనే వైద్యం అందించడానికి శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారు. వార్మర్, లారింగోస్కోప్ వంటి ప్రత్యేక వసతులు కూడా ఉన్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో..



నవజాత శిశువులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆస్పత్రికి తీసుకువస్తున్నాం. మరింత మెరుగైన వైద్యం కోసం నీలోఫర్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు తరలిస్తున్నాం. ఈ అంబులెన్స్‌లో అధునాతన సేవలు అందుబాటులో ఉన్నాయి.

– రవికుమార్, ప్రోగ్రాం మేనేజర్

24 గంటలూ సేవలు..



నవజాత శిశువులకు సంబంధించి అత్యవసర అంబులెన్స్ సేవలు 24 గంటల పాటు అదుబాటులో ఉంటాయి. మా వాళ్లు నిరంతరం పనిచేస్తున్నారు. ఈ అంబులెన్స్ మినీ ఐసీయూలా ఉంటుంది. ఉచిత నవజాత శిశువు అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలి.

– తిరుపతి, 108 జిల్లా అధికారి

ఎన్నో ప్రాణాలను కాపాడాం



సమాచారం అందిన వెంటనే స్పందించి, అంబులెన్స్‌లో శిశువులను సకాలంలో ఆస్పత్రులకు చేరుస్తున్నాం. ఇందులో అధునాతన సేవలు అందుబాటులో ఉండడంతో ఎంతో మంది నవజాత శిశువుల ప్రాణాలను కాపాడగలిగాం. మా సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– తోట కృష్ణస్వామి, ఈఎంటీ

సకాలంలో చేరుస్తున్నాం



నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లో అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఏ సమయంలోనైనా మేం సేవలందించేందుకు సిద్ధంగా ఉంటాం. ఈ అంబులెన్స్ ద్వారా అత్యవసర సమయంలో ఎంతో మందిని సకాలంలో ఆస్పత్రికి చేర్చి, వారి ప్రాణాలు కాపాడగలిగాం.

– విజయ్‌కుమార్, పైలట్

న్యూస్‌రీల్

'ఓటరు లిస్ట్‌లో తప్పులు లేకుండా చూసుకోవాలి'



సదాశివనగర్: ఓటరు లిస్టులో తప్పులు దొర్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావ్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఓటరు లిస్టులను క్షుణ్ణంగా పరిశీలించి మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయంలో విచారణ



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయంలో శనివారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ విచారణ చేపట్టారు. నాగిరెడ్డిపేట తహసీల్దార్ లక్ష్మణ్ అవినీతికి పాల్పడుతున్నారంటూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకొన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తానని పేర్కొన్నారు. విచారణ ముగించుకొని ఆర్డీవో వెళ్లిపోతుండగా పలువురు రైతులు తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌యూబీ (రైల్వే కమాన్) వద్ద వరద నీటిలోకి బస్సును తీసుకెళ్లిన డ్రైవర్ సాంబయ్యను ఆర్టీసీ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ నెల 19న హైదరాబాద్ నుంచి నిజామాబాద్ బస్టాండ్‌కు వస్తున్న బస్సును ఆర్‌యూబీ వద్ద వరద నీటిలోనుంచి ముందుకు తీసుకువెళ్లడానికి డ్రైవర్ ప్రయత్నించాడు. మధ్యలో బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. బస్సులో మొత్తం 50 మంది ఉండగా.. ట్రాఫిక్ పోలీసులు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ఘటనపై విచారణ నివేదిక ఆధారంగా డ్రైవర్ సాంబయ్యపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తింది. ఇన్‌ఫ్లో శనివారం ఉదయం 12 వేల క్యూసెక్కులకు పెరగ్గా, మధ్యాహ్నానికి 25 వేలకు, సాయంత్రానికి 30 వేల క్యూసెక్కులకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1082.30 (51.62 టీఎంసీలు) అడుగుల నీరుంది.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడ: ఆస్పత్రి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని పాత ఏరియా ఆస్పత్రి ఆవరణలో చేపట్టిన ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లు చెక్కుచెదరకుండా ఉండేలా భవనాన్ని నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారం తర్వాత అమృత్ 2.0 పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. నెల రోజులపాటు అన్నీ ఆలోచించి, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానని పోచారం పేర్కొన్నారు. సిద్ధాపూర్ ఎత్తిపోతల పథకానికి రూ.300 కోట్లు అవసరమని, కాంగ్రెస్‌లో చేరకపోయుంటే అక్కడ ముళ్ల చెట్లు పెరిగేవని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖపై తనకున్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ శాఖకు సలహాదారుగా నియమించారన్నారు. ఈనెల 27న వ్యవసాయ శాఖపై సమావేశం ఉందని, తాను సలహాలు, సూచనలు ఇవ్వడానికి వెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ సుజాత, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఖాలెక్, ఎజాస్, రవీందర్, సురేష్, నర్సింగ్ కాలేజ్ సూపరింటిండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

27న గురుకులాల్లో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్

కామారెడ్డి టౌన్: సాంఘిక గురుకుల కళాశాలల్లో బైపీసీ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 27న స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని దేవునిపల్లి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బి.వనిత రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపేట్, దేవునిపల్లి, కామారెడ్డి గురుకులాల్లో ఇంటర్ బైపీసీ ఫస్టియర్‌లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ టీసీ, బోనఫైడ్, క్యాస్ట్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని కౌన్సెలింగ్‌కు రావాలని, ఇతర వివరాలకు 79950 10656 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బస్వాపూర్ విండో విభజన

- కాచాపూర్ కేంద్రంగా మరో సొసైటీ
- ఉత్తర్వులు జారీ చేసిన సహకార శాఖ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/భిక్కనూరు: బస్వాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని విభజిస్తూ జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీబీ డైరెక్టర్ కిష్టాగౌడ్, బస్వాపూర్ సొసైటీ సీఈవో మహేశ్వరి ఈ ఉత్తర్వులను అందుకున్నారు. 2006 సంవత్సరానికి ముందు కాచాపూర్ సింగిల్ విండో వేరుగానే ఉండేది. ఆ తర్వాత ఈ సంఘాన్ని బస్వాపూర్ విండోలో విలీనం చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తిరిగి కాచాపూర్ సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని రైతులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. గతేడాది అప్పటి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ విండో విభజన కోసం ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సీఎం ఆదేశాల మేరకు విండోను విభజించడానికి చర్యలు తీసుకున్నారు. అయితే ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా జిల్లా సహకార శాఖ అధికారులు విండోను రెండుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బస్వాపూర్ విండోను విభజిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బస్వాపూర్ విండో పరిధిలో బస్వాపూర్, ర్యాగట్లపల్లి, గుర్జకుంట గ్రామాలు, కొత్తగా ఏర్పాటయ్యే కాచాపూర్ విండోలో కాచాపూర్, బంజర్ల గ్రామాలు ఉండనున్నాయి. సొసైటీ విభజనతో సొసైటీ పాలక వర్గం రద్దు అవుతుంది. పాలక వర్గం స్థానంలో రెండు సొసైటీలకు సహకార శాఖకు సంబంధించిన అధికారులకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. చాలా నెలల క్రితమే సొసైటీ విభజన జరగాల్సి ఉందని, కానీ ఎన్నికల మూలంగా ప్రక్రియ ఆగిపోయిందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ 'సాక్షి'తో పేర్కొన్నారు. ఎట్టకేలకు విభజన జరిగిందన్నారు. విండో విభజనతో రైతులకు మెరుగైన సేవలు అందుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


డీసీవోనుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ కిష్టాగౌడ్, సొసైటీ సీఈవో మహేశ్వరి

కార్మికులుగా నమోదు చేసుకోవాలి

- నమోదు చేసుకుంటేనే పథకాల లబ్ధి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: నిర్మాణ రంగ కార్మికులు కార్మిక శాఖలో తమ పేరును నమోదు చేసుకుని లబ్ధి పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమంపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మిక చట్టం ప్రకారం భవనం, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాటి నిర్మాణానికి అయ్యే వ్యయం విలువలో ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మిక శాఖకు సమర్పించాలన్నారు. వసూలు చేసిన సెస్‌ను కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగిస్తారన్నారు. కార్మిక శాఖలో పేరు నమోదు చేసుకున్న వారు సహజ మరణం పొందితే రూ. 1.30 లక్షల వరకు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ. 6.30 లక్షల వరకు వారి కుటుంబ సభ్యులకు అందుతాయని పేర్కొన్నారు. పాక్షిక వైకల్యానికి రూ.5 లక్షల వరకు పొందవచ్చన్నారు. కార్మికుని కూతురు వివాహానికి రూ.30 వేలు, ప్రసూతి సహాయ పథకాలకు రూ.30 వేల వరకు పొందవచ్చన్నారు. జిల్లా అధికారులు పని ప్రదేశాలను పరిశీలించి, ఈ విషయమై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు, సీపీవో రాజారాం, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నెలకోసారి హాస్టళ్లలో బస

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కలెక్టర్లు హాస్టళ్లు, గురుకులాలను తనిఖీ చేయాలని, నెలకోసారైనా హాస్టళ్లలో బస చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లాలో పర్యటనలకు వెళ్లినపుడల్లా ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. ఇటీవల నిజాంసాగర్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓ ఉద్యోగి రోజుల తరబడిగా గైర్హాజరవుతున్నట్లు గుర్తించి సస్పెండ్ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. రోజూ జిల్లాలో ఏదో ఒక ప్రాంతానికి వెళ్తున్న కలెక్టర్ తప్పనిసరిగా స్కూళ్లు, ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నారు. ఇకపై హాస్టళ్లు, గురుకులాలను కూడా తనిఖీ చేయనున్నారు.

వచ్చేనెల 1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): సంస్థాగత నిర్మాణంలో భాగంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబర్ 1 నుంచి చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదును విజయవంతం చేసేందుకు ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు మండలస్థాయి, 31న పోలింగ్ బూత్‌స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. 88000 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని కోరారు. అంతకుముందు నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డికి సభ్యత్వ నమోదుపై కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, గద్దె భూమన్న, శివరాజ్ కుమార్, మేక సంతోష్, శివప్రసాద్, గోపిడి స్రవంతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జీఎంసీ ప్రిన్సిపల్‌గా కల్యాణి శ్రీనివాస్

- అనారోగ్య కారణాలతో మెడికల్ లీవ్‌లో..
- మరొకరిని నియమించే అవకాశం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా కల్యాణి శ్రీనివాస్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పనిచేసిన పెరుగు వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రస్తుతం డాక్టర్ శివప్రసాద్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా కొనసాగుతున్నారు. డీఎంఈ తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మెడికల్ కాలేజీల ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ప్రొఫెసర్ కల్యాణి శ్రీనివాస్ కామారెడ్డికి రావడానికి ఆసక్తి చూపడం లేదు. తనకు ఇటీవల వెన్నుపూసకు ఆపరేషన్ అయ్యిందని, దీంతో మెడికల్ లీవ్‌లో ఉన్నానని కల్యాణి శ్రీనివాస్ 'సాక్షి'తో ఫోన్ ద్వారా తెలిపారు. ఈ విషయాన్ని డీఎంఈ అధికారులకు మెయిల్, లేఖల ద్వారా వివరణ ఇచ్చానని పేర్కొన్నారు. కాగా ఈనెల 31వ తేదీన మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్స్ ఉన్న చోట రెగ్యులర్ ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్‌లను నియమించే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

రేపు జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో సాక్షి ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో వైరల్ ఫీవర్, డెంగీ, చికున్‌గున్యా, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆయా వ్యాధులతోపాటు ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోవడం తదితర సమస్యలకు సంబంధించిన అంశాలపై వైద్య సలహాలు, సూచనలు, అవగాహన కోసం 'సాక్షి' జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఆయా సమస్యలపై ప్రజలు కింది నంబర్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.


రాంసింగ్, జీజీహెచ్ సూపరింటెండెంట్

తేది : 26-08-2024 (సోమవారం)
సమయం: ఉదయం 10:00 నుంచి 11:00 గంటల వరకు.

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98480 91864

తెలంగాణ మణిహారంగా గడికోట

- వారసత్వ సంపద పరిరక్షణలో సంస్థానాధీశుల వారసుల సేవలు భేష్
- చర్చావేదికలో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

దోమకొండ: దోమకొండ గడికోట తెలంగాణ మణిహారంగా, వారసత్వ సంపదగా మిగిలిపోతుందని తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. శనివారం గడికోటలో తెయూ సౌత్ క్యాంపస్, గడికోట ట్రస్టు సంయుక్తంగా తెలంగాణ చరిత్ర, వారసత్వం(ప్రాచీన కాలం నుంచి ప్రస్తుత కాలం వరకు) అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి యాదగిరి మాట్లాడుతూ వారసత్వ సంపద పరిరక్షణలో దోమకొండ సంస్థానాధీశుల వారసుల సేవలను ప్రశంసించారు. గడికోటకు అవార్డు ఆఫ్ మెరిట్ విభాగంలో యునెస్కో అవార్డు లభించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 287 చారిత్రక కట్టడాలకు సంబంధించి దరఖాస్తులు రాగా యునెస్కో దోమకొండ గడికోటను ఈ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. పురాతన కట్టడాల పరిరక్షణకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, దివంగత కామినేని ఉమాపతిరావ్, ఆయన కుమారుడు కామినేని అనిల్‌కుమార్ కృషి చేశారన్నారు. తెలంగాణతోపాటు దేశంలోని పలు ప్రాంతాల్లో నాటి రాజులు నిర్మించిన కట్టడాలు ఉన్నాయన్నారు. పలు ప్రాంతాల్లో నాటి రాజులు చేపట్టిన నిర్మాణాలు, వారు చేసిన సేవలపై చర్చావేదికలో చర్చించారు. వారసత్వ సంపదను తరువాత తరానికి కూడా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని సంస్థానాల పాత్ర అనే అంశంపై సిర్నాపల్లి సంస్థానాధిపతి డాక్టర్ అనురాధరెడ్డి మాట్లాడారు. బ్రిటిష్, నిజాం కాలంలో సంస్థానాలు ప్రజలకు ఏ విధంగా సేవలందించాయో వివరించారు. నాటి రాజుల కాలంలో వాడిన నాణేలు, కరెన్సీ నోట్లను అధ్యాపకుడు శ్రీగాధ శంకర్ వివరించారు.కార్యక్రమంలో తెయూ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్, ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సోషల్ సైన్సెస్ డీన్ ఘంటా చంద్రశేఖర్, వక్తలు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు అడప సత్యనారాయణ, డాక్టర్ రాజిరెడ్డి, అంజయ్య, గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ, కోడైరెక్టర్ అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నారాయణ గుప్తా, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ వెంకట్‌రెడ్డి, పోతన్న, రమేశ్, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ మారయ్య గౌడ్, ఆర్కే డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి


పురాతన నాణేలను పరిశీలిస్తున్న అతిథులు

క్లుప్తంగా

28న టెన్నికాయిట్ జిల్లా జట్లు ఎంపిక

రామారెడ్డి : రెడ్డిపేట పాఠశాలలో టెన్నికాయిట్ సబ్‌జూనియర్ బాలుర, బాలికల టెన్నికాయిట్ టోర్నీ కం సెలక్షన్ ఉంటుందని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సాయి మౌర్య శనివారం తెలిపారు. ఈనెల 28 నుంచి జెడ్పీహెచ్‌ఎస్ రెడ్డిపేట్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి టెన్నికాయిట్ సబ్ జూనియర్ బాలుర, బాలికల టెన్నికాయిట్ టోర్నీ కం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ సాయి మౌర్య పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నిజామాబాద్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడో సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నీ ఆర్మూర్ మినీ స్టేడియంలో వచ్చేనెల 1 నుంచి పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



మాచారెడ్డి : మండలంలోని ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా బ్యాగ్‌లెస్ డే సందర్భంగా శనివారం బ్రాహ్మణపల్లి తండాను సందర్శించారు. బ్రాహ్మణపల్లి తండాలో జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడే వనభోజనం చేసి గోకులాష్టమి వేడుకలను జరుపుకోన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు దేవిచంద్, సంతోష్ తదితరులున్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



బీబీపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమేశ్‌బాబు, అధికారులు

బీబీపేట : రైతుల వద్దకే విద్యుత్ సిబ్బంది వెళ్లి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకే రైతు పొలంబాట అని విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ బాబు అన్నారు. శనివారం రైతు పొలం బాట కార్యక్రమంలో భాగంగా ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారి మాధవరావు రైతుల వద్దకు వెళ్లి రైతులకు పలు సూచనలు కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి కెపాసిటర్‌ను మోటర్‌కు పెట్టుకుంటే కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కిరణ్ చైతన్య, ఏఈ దివ్యగాయత్రి మండలం లోని విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ : మండల కేంద్రంలో శనివారం విద్యుత్ అధికారులు పొలంబాట నిర్వహించారు. వరంగల్ నోడల్ ఆఫీసర్ మాధవరావు(సూపర్ ఇన్ పెండింగ్ ఇంజినీర్ క్వాలిటీ కంట్రోల్ వరంగల్), సూపర్ ఇంటెండింగ్ ఇంజినీర్ ఆపరేషన్ కామారెడ్డి సర్కిల్ రమేశ్ బాబు, సబ్ డివిజనల్ ఇంజినీర్ కిరణ్ చైతన్య, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్‌తో పాటు సిబ్బంది తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా లింగుపల్లి గ్రామంలో పొలాలను సందర్శించారు.



దోమకొండలో..

ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దు



వ్యర్థాలు వేసే డబ్బాలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, కొత్త బస్టాండ్ ఎదుట ప్లాస్టిక్ వ్యర్థాలు వేసేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన డబ్బాలను ఏర్పాటు ప్రారంభించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఇందుకోసం ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, కవర్లు తదితర వస్తువులను ఈ డబ్బాల్లో వేయాలన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి, కొత్తబస్టాండ్ ముందు ఈ డబ్బాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మిర్జా ఆఫీస్ బేగ్, శివ కృష్ణ మూర్తి, గరిగంటి స్వప్న, వంశీ, నాయకులు గడ్డం చంద్రశేకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భాస్కర్ గౌడ్, ఏ ఈ శంకర్, సానిటరి ఎస్సై పర్వేజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల జోలికొస్తే ఊరుకోం..



మాచారెడ్డి(కామారెడ్డి) : పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న గిరిజన రైతుల జోలికొస్తే ఊరుకోమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం మండలంలోని ఎల్లంపేట, నడిమి తండాలో పోడు రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్, జిల్లా నాయకులు లింబ్యా,నరహరి, మాన్సింగ్ తదితరులున్నారు.

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



బీబీపేటలో రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

బీబీపేట : సమయానికి బస్సులు రాకపోవడంతో కళాశాలకు, పాఠశాలలకు వెళ్లడం ఇబ్బందిగా మారిందని శనివారం మండల కేంద్రంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. మండలంలోని మల్కాపూర్, ఇస్సానగర్, తుజాల్‌పూర్ గ్రామాల విద్యార్థులు ప్రధాన చౌరస్తా వద్దకు చేరుకొని గంట పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నడిచినటువంటి మల్కాపూర్, తుజాల్‌పూర్ నుంచి భూంపల్లి, ఇస్సానగర్ బస్సులు గత సమయంలో నడిచిన విధంగా రావట్లేదన్నారు. అంతే కాకుండా గతంలో నడిచిన బస్సులను ప్రస్తుతం నడపడం లేదని, మళ్లీ ఎప్పటి లాగే బస్సులు నడిపించాలని వారు డిమాండ్ చేశారు. అక్కడకు చేరుకున్న ఎస్సై ప్రభాకర్ విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌కు కలిసి విన్నవించాలని సూచించారు. దీంతో విద్యార్థులు కామారెడ్డికి వెళ్లి డిపో మేనేజర్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలోనూ వినతిపత్రమిచ్చామని, సమస్య పరిష్కరించకుంటే డిపో ఎదుట ధర్నా చేస్తామన్నారు.



కామారెడ్డిలో డిపో మేనేజర్‌కు వినతిపత్రమిస్తూ..

గ్రామాల్లో పెరుగుతున్న జ్వర బాధితులు



వివరాలు సేకరిస్తున్న వైద్యులు, సిబ్బంది

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామంలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. వారం రోజుల నుంచి గ్రామంలో డెంగీ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శనివారం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి డెంగీ నిర్ధారణ కావడంతో గ్రామస్తులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డెంగీబారిన పడిన బాధిత కుటుంబం నివాస ప్రాంతాల్లో దోమల మందు పిచికారి చేయించారు. దోమలతోనే డెంగీ వ్యాప్తి చెందుతున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు రోహిత్ కుమార్ తెలిపారు. గ్రామంలోని ప్రతిఇంటికీ వెళ్లి సర్వే చేస్తున్నామన్నారు.

ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి



రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): పంట రుణాలు తీసుకున్న ప్రతీ రైతుకు ఎలాంటి షరతులు పెట్టకుండా రుణాలు మాఫీ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం లింగంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాజారాం బాలయ్య ఆధ్వర్యంలో రైతు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ప్రజలు, రైతులు ఓట్లు వేసి గెలిపిస్తే రైతు భరోసా, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా ఆగం చేసిందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాం, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రంచందర్, కిసాన్‌సన్ మండల అధ్యక్షుడు చేపూరి పోశెట్టి తదితరులున్నారు.

టీచర్లకు సన్మానం



పిట్లం(జుక్కల్) : మండలంలోని మద్దెలచెరువు గ్రామం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొన్నేళ్లుగా విధులు నిర్వహించి ప్రమోషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులు గోపాల్, శోభారాణి, కల్పనను అదేవిధంగా బదిలీపై వెళ్లిన సుకన్య, నిర్మల, హటీయాసింగ్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు విద్యార్థులు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి దేవిసింగ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీలత, పాఠశాల హెచ్‌ఎం సుంఖ్య నాయక్, ఉపాధ్యాయులు మధుసూదన్, అరుణ్ కుమార్, హన్మాండ్లు, జ్యోతి లక్ష్మి, గ్రామ పెద్దలు విఠల్ రెడ్డి, నడిపి గంగారం తదితరులున్నారు.

రుణ సంకెళ్లు తెంచండి



మామిడిపల్లి వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

ఆర్మూర్ : షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసి, రుణ సంకెళ్ల నుంచి విముక్తి కల్పించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణం మామిడిపల్లి శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు చెందిన రైతులు రాజకీయాలకు అతీతంగా రోడ్డుపై బైఠాయించి శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు వి ప్రభాకర్, ఇట్టెడి లింగారెడ్డి, దేగాం యాదగౌడ్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులు అడగకున్నా వరంగల్ డిక్లరేషన్ అంటూ కాంగ్రెస్ నాయకులు రూ.రెండు లక్షల రుణ మాఫీని ప్రకటించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఖజానా ఖాళీ ఉందంటూ, ఎన్నికల కోడ్ అంటూ రైతులను మోసం చేసే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రైతులందరికీ రూ.49 వేల కోట్ల రుణ మాఫీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన ఒట్టేసిన దేవుళ్లు, నమ్మిన రైతులు క్షమించరన్నారు. ఏక కాలంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి దాటవేయడంపై మండిపడ్డారు. ఆర్మూర్‌లో రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు బి దేవరాం, వెల్మల్ రా జన్న, సుక్కి సుధాకర్, ఆర్గుల్ సురేష్, జైడి భాస్క ర్, నక్కల భూమారెడ్డి, కె రాజారెడ్డి, మంథని నవీన్ రెడ్డి, తనుజా రెడ్డి, విజయ లక్ష్మి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డెడ్‌లైన్ సెప్టెంబర్ 15..

ఆగస్టు 15వ తేదీలోగా రైతుల రుణ మాఫీ పూర్తి చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారని రైతు జేఏసీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెల 15వ తేదీలోగా ప్రతి రైతుకు రుణ మాఫీ చేయ ని పక్షంలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ ఉద్య మ కార్యాచరణ రూపొందించుకొని అసెంబ్లీ ముట్ట డిని కూడా చేస్తామని హెచ్చరించారు. ఆర్మూర్ ప్రాంత రైతాంగం చేపట్టిన ఉద్యమాల ను వివరించారు. భవిష్యత్తులో రైతులు చేసే ఉద్యమాలకు రాజకీయ నాయకులు హాజరు కావద్దంటూ పలువురు రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న ఉచితశిక్షణ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, సెల్‌ఫోన్ రిపేర్, ఏసీ రిపేర్ కోర్సులకు సంబంధించి శిక్షణకు (పురుషులకు మాత్రమే) దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు 19 నుంచి 45 ఏళ్ల వారు అర్హులన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన గ్రామీణ యువకులు తమ ఆధార్, రేషన్, ఎస్సెస్సీ మెమో, 5 పాస్‌పోర్టు ఫొటోలతో ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..



రాహుల్(ఫైల్)

ఇందల్వాయి: అంత్యక్రియలకు వెళ్లి ఓ యువకుడు అనంత లోకాలకు వెళ్లిన ఘటన మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మనోజ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పోగుల రాహుల్(19) అదే గ్రామానికి చెందిన బంధువు అంత్యక్రియల్లో పాల్గొని స్నానం చేసేందుకు మత్తడి వాగులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి ..



ఖలీల్‌వాడి: ఫిట్స్ రావడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాందేవ్‌వాడ ప్రాంతంలో చోటుచేసుకుంది. మూడో టౌన్ ఎస్సై మహేశ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న నాందేవ్‌వాడ ప్రాంతంలో ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోవడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. ఎవరైనా మృతుడి ఆచూకీ తెలిస్తే 8712659839 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



గాంధారి: మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నా యి. గ్రామానికి చెందిన పత్తి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం వేరే గ్రామానికి వెళ్లారు. అర్ధరాత్రి ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు స మాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సే కరించారు. బీరువాలో ఉన్న 15 గ్రాముల బంగారం, 20 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

నందిపేట్: మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి ఆలయ గోడను దూకి ప్రధాన ద్వారం లోపలికి వెళ్లేందుకు యత్నించాడు. విషయాన్ని గమనించిన ఆలయ పూజారి ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే వారు వచ్చి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది.

డెంగీతో బాలిక మృతి

15 రోజుల క్రితం మరొకరు..

సదాశివనగర్ : భూంపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక డెంగీతో శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని మొగ్గం మనస్విని(12) బాలిక రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. దీంతో కుటుంబీకులు గమనించి కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి ఆశ కార్యకర్తగా పనిచేస్తోంది. 15 రోజుల క్రితం ఒకరు డెంగీతో మృతి చెందిన విషయం విధితమే. అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



రాజిరెడ్డి(ఫైల్)

సదాశివనగర్: అప్పుల బాధ తో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చో టు చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తడిగెం రాజిరెడ్డి(41) ఇటీవల బతుకుదెరువు నిమిత్తం దుబాయికి వెళ్లి తిరిగి వచ్చాడు. దుబాయికి వెళ్లడానికి చేసిన అప్పులు పెరిగిపోవడంతో మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి/ పిట్లం: ఎడపల్లి మండల కేంద్రంలో ప్ర భుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న మూడు ఇసు క టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై వంశీదర్‌రెడ్డి శనివారం తెలిపారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి తరలుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. అనంతరం ఇసుక టిప్పర్లను పీఎస్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- ఎస్బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ ఉమ్మడి రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి



శిక్షణ పొందుతున్న వారితో ఆర్‌ఎస్‌ఈటీఐ తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డైరెక్టర్ విశ్వనాథ్ రెడ్డి అన్నారు. డిచ్‌పల్లిలోని ఎస్బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐను శనివారం ఆయన సందర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణను పరిశీలించి శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. జీవితంలో స్థిరపడేందుకు స్వయం ఉపాధి శిక్షణ మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్, లక్ష్మణ్, జమున, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి తిట్టినందుకు హత్య



సిద్ధిరాం(ఫైల్)

మద్నూర్: మద్యం మత్తులో తమను తిట్టాడనే కోపంతో ఓ వ్యక్తిని ముగ్గురు హత్య చేసిన ఘటన మండలంలోని పెద్ద ఎక్లార గ్రామంలో చోటు చేసు కుంది. ఎస్సై విజయ్‌కొండా, రైతులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన దానే వార్ సిద్ధిరాం(45)కు మద్యం తాగే అలవాటు ఉంది. మద్యం మత్తులో శనివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన హన్మంత్, రాజు, సాయిలుని దూషించాడు. దీంతో వారు పశువుల కొట్టం వద్ద సిద్ధిరాం ఉన్నట్లు గుర్తించి రాత్రి కర్రలతో బాది హత్య చేశారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తునికి వద్ద రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు



అశ్విని మృతదేహం

నిజాంసాగర్: మెదక్ జిల్లా కొడిపల్లి మండలం తునికి గేట్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వినిబాయి(32) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బిచ్కుంద మండలం చిన్నదడిగి గ్రామానికి చెందిన అశ్విని బాయి బీరుగొండ దంపతులు తమ కుమార్తె సింధుజ ఆరోగ్యం బాగా లేకపోవడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో కారులో వస్తుండగా తునికి గేట్ వద్ద వీరి కారుతో పాటు మరో రెండు కార్లు ఒకదానికి వెనుక ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో అశ్విని బాయి అక్కడికక్కడే మృతి చెందగా భర్త బీరుగొండ, కుమార్తె సింధూజ, కుమారుడితో పాటు కారు డ్రైవర్కు తీవ్ర గాయాలయ్యాయి.